# కలుసుకున్న రైలుపట్టాలు

సి. విశ్వేశ్వరరావు

చతుర్వేది బట్టతలమీద మిగిలిపోయిన ఒకటి రెండు తెల్లవెంట్రుకలు, ఎండి పోయిన చెరువులోని రెల్లుపూలలాగా ఫ్యాన్ గాలికి కదుల్తున్నాయి. రాత్రి వచ్చిన కేబిల్‌ను మళ్ళీ ఒకటికి రెండు సార్లు చదువుకొన్నాడు ఆ వచ్చే వ్యక్తి తనకు పూర్తిగా అపరిచితుడయినప్పటికీ ఏర్‌పోర్టుకు వెళ్ళి అతణ్ణి రిసీవ్ చేసుకోవటం సభ్యత అనుకొన్నాడు. అందుకే నాయర్‌ను కేకేసి తను ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆలస్యమవుతుందనీ తనకోసం వెయిట్ చేయొద్దని చెప్పి బయల్దేరాడు.

కారు అబిడ్ సెంటరు మీదుగా పోతూంది. అందంగా అలంకరించుకొని ప్రియునికోసం వెళ్ళే అభిసారికలాగా అబిడ్ సెంటరు నియాన్ దీపకాంతులలో మెరిసిపోతూంది. పర్వతాలు పారాడినట్లు డబల్ డెక్కర్ బస్సులు నున్నటి సిమెంటురోడ్డు మీద పరుగెత్తుతున్నాయి. "రేన్‌బుక్ రేన్‌బుక్" అని అరుస్తూన్న కుర్రాళ్ళ కేకలు గుర్రపుడెక్కల సవ్వడి లాగా ఆ సెంటరులో ప్రతిధ్వనిస్తున్నాయి.


ఇవేవి చతుర్వేది ఆలోచనలకు అంతరాయం కలిగించటంలేదు. బేగంపేట విమానాశ్రయం పోతూన్న చతుర్వేది మనసులో మెదుల్తూన్నదల్లా ఒక్కటే ప్రొద్దుట తన పేరిట ఓవర్‌సీస్ నుంచీ కేబిల్. శాన్‌ఫ్రాన్సిస్కోనుంచీ మిస్టర్ బ్రౌన్ అనే వ్యక్తి తనను కలుసుకొనేందుకు వస్తూన్నట్లు ఏర్‌పోర్టు దగ్గరకు రావలసిందని కోరుతూ కేబిల్ పంపాడు. ఈ బ్రౌన్ ఎవడో తన నెందుకు కలుసుకోవాలనుకొంటున్నాడో చతుర్వేదికి అంతుపట్టలేదు. తన పాతికేళ్ళ సర్వీసులో అధికారరీత్యా బ్రౌన్ అనే వ్యక్తి కలుసుకొన్న జ్ఞాపకంకూడా లేదు ఆ బ్రౌన్ ఎలా వుంటాడో, ఎంత వయసుంటుందో ఊహించుకోసాగాడు చతుర్వేది. వయస్సులో బ్రౌన్ తన సమకాలికుడై వుండొచ్చునని చతుర్వేది అంచనా.

ఉద్యోగరీత్యా చతుర్వేది ఐ.సి.యస్ ప్యాసయి, జిల్లా కలెక్టరుగా దక్షిణాదిలో యించుమించు అన్ని జిల్లాలలో పని చేశాడు రిటైరుమెంటుకు ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో బోర్డు మెంబరుగా పనిచేసి రిటైరయ్యాడు. బంజారహిల్స్ ప్రాంతంలో సొంత బంగళా కట్టించుకొని హైద్రాబాదులో స్థిరపడిపోయాడు. చతుర్వేదికి ఇద్దరు మగపిల్లలూ, ఒక ఆడపిల్ల, ఆడపిల్లకు పెళ్ళి చేశాడు. అల్లుడొక పోలీసు ఆఫీసరు. కొడుకులిద్దరూ కూడా హోదాగల మంచి పదవుల్లో వున్నారు. ఒకతను యం.యస్. ప్యాసయి గాంధీహాస్పటల్‌లో సివిల్ సర్జన్‌గా వుంటున్నాడు. రెండోవాడు యింజనీరింగు ప్యాసయి, విశాఖపట్టణంలో అసిస్టెంటు ఇంజనీరుగా పనిచేస్తున్నాడు రిటైరుమెంటుకు ముందే భార్య చనిపోయింది అప్పట్నుంచీ చతుర్వేది జీవితం ఒంటరిదైపోయింది జీవితంలో తనకిక ఏ కొదువలూ లేక పోయినా, ఒంటరిజీవితం దుర్భరమనిపించేది. భోజనం వగైరా చేసిపెట్టేందుకు, తనకు తోడుగా నాయర్ వుంటున్నాడు. ఉద్యోగరీత్యా యితర జిల్లాలలో పనిచేస్తున్నప్పటినుంచీ నాయర్ తన దగ్గరే వుంటున్నాడు నాయర్ తనకు నమ్మినబంటు- అతడికి నా అనే వాళ్లెవరూ లేరు.

కారు బేగంపేట విమానాశ్రయం వేపు దూసుకొని పోతూంది. టైం చూసుకున్నాడు. ఏడుంబావు అయింది. ఈవినింగొ ఫ్లైట్‌లో బోయింగు విమానంలో బొంబాయినుంచి వస్తూన్నట్లు బ్రౌన్ కేబిల్ పంపాడు. బోయింగు సరిగా ఏడు ముప్పావుకు వస్తుంది. అంటే, తనకింకా అర్ధగంట వ్యవధివుంది. మనసు పెడుతూన్న తొందరకొద్దీ, చతుర్వేది ఆక్సిలేటరు నొక్కాడు. కారు శరవేంతో పరుగెడుతూంది. విమానాశ్రయం చేరుకోగానే, కారును పార్కింగ్ లాట్‌లో ఆపి, లౌంజ్ వేపు నడిచాడు

విమానాశ్రయం జనంతో కోలాహలంగా వుంది- అడుగడుగునా ఆధునాతన నాగరికత పుణికి పుచ్చుకొన్నట్లుగా వున్న ఆడా మగా జనంతో కళకళలాడిపోతూంది. నవ్యత తొణికిసలాడే శ్రీమంతుల సరదాలన్నీ అక్కడే కనిపించాయి.

చతుర్వేది బుక్‌స్టాల్ వేపు నడిచాడు. ప్రసిద్ధ ఆంగ్ల రచయితల నవలలన్నీ అందంగా ర్యాక్సులో పేర్చబడ్డాయి. బ్రిటాండ్ రసల్ రాసిన "Conquest of Happiness" అనే పుస్తకం చతుర్వేది దృష్టిని ఆకర్షించింది. ఒకప్పుడు క్రైమ్ ఫిక్షన్‌బెగ చదివేవాడు- కాని ఒంటరితనంతో విసుగెత్తిపోయిన చతుర్వేదికి యిప్పుడు కావల్సింది, మనశ్శాంతి. అందుకే ఇటీవల తను చదివే పుస్తకాలన్నీ ఆధ్యాత్మిక చింతనగల



పుస్తకాలే. చతుర్వేది బెర్ట్రాండ్ రసెల్ పుస్తకం కొన్నాడు.

బోయింగు విమానం కొద్దిక్షణాలలో ల్యాండ్ కాబోతున్నట్లు అనౌన్సుమెంటు వినిపించింది. చతుర్వేది కిప్పుడు ఒక పెద్ద సమస్య ఎదురయింది. ముక్కూ-మొహం ఎరగని బ్రౌన్‌ను ఎలా పోల్చు కోవటమో చతుర్వేదికి అర్థంకాలేదు.

బోయింగ్ లాండ్ అయింది. ప్రయాణీకు లొకరొకరే దిగుతున్నారు. కారిడార్సులో నిల్చుని లాడర్‌నుంచీ దిగుతూన్న ప్రయాణీకులను ఆసక్తితో గమనిస్తున్నాడు. కాని తనకు కావాల్సిన మనిషి వాళ్ళలో వున్నట్లు తోచలేదు చతుర్వేదికి,

ఇప్పుడేమిటి చేయడమాని ఆలోచిస్తూ నిల్చున్న చతుర్వేదికి లౌడ్‌స్పీకరునుంచీ అనౌన్సుమెంటు వినిపిరిచింది

"స్టేట్‌నుంచి వచ్చిన బ్రౌడ్‌కస్టమ్సు రూందగ్గిర చతుర్వేది కొరకు వెయిట్ చేస్తూన్నట్లు, చతుర్వేది ఎక్కడవున్నా వెంటనే కస్టమ్సు రూందగ్గర బ్రౌన్‌ను కలుసుకోవలసిం" దంటూ ప్రకటన వినిపించిది. హుటాహుటి చతుర్వేది కస్టమ్సు రూందగ్గరకు వెళ్ళాడు అక్కడున్న కష్టమ్సు అధికారి బ్రౌన్‌ను చతు

ర్వేదికి పరిచయం చేశాడు- ఇద్దరూ కరచాలనం చేసుకొన్నారు.

"హ్యాపీ టు మీట్ యు" అంటే

గ్లాడ్ టు సీయు "అని ఒకర్నొకరు పలకరించుకొన్నారు.

వయస్సులో తన సమకాలికుడై వుంటాడని వూహించుకొన్న బ్రౌన్, ముప్ఫయ్యేళ్ళ యువకుడుగా ప్రత్యక్ష మయ్యేసరికి చతుర్వేది అంచనా తారుమారయింది- షష్టిపూర్తి సమీపిస్తూన్న తనతో ఈ నవయువకుడికి పనేమిటో చతుర్వేదికి అంతుపట్టలేదు- బలిష్టమూ ఎత్తయిన శరీరమూ, పాలిపోయిన తెల్లని దేహచ్ఛాయ, నీలివన్నె కళ్ళు, మొక్కజొన్న కంకిలోని పీచు లాంటి జుట్టుకు మారు నల్లగా నిగనిగ లాడుతూన్న తుమ్మెద రెక్కల్లాంటి ఉంగరాల క్రాపింగూ పసిడి నిమ్మపండు లాంటి వన్నె, ఎక్కడో అంతరాంత రాళాల్లోకి చూస్తూన్న కనుపాపలతో హుందాతనంవుట్టి పడేట్లుగా తనముందు నిల్చున్న బ్రౌన్‌ను చూసేసరికి చతుర్వేది క్షణకాలం నిరుత్తరుడయ్యాడు. అదాటునే చూసిన వాళ్ళెవరూ చెబితే తప్ప అతణ్ణి అమెరికన్ అనుకోరు. అచ్చం భారతీయుడిలాగా కనిపిస్తు న్నాడు. ఆ కళ్ళు తను ఎప్పుడో ఎక్కడో చూచినట్లు గుర్తు. ఆ కళ్ళలోని వెలుగు తనకు చాలా సుపరిచితమైన దన్న భావన కలిగింది చతుర్వేదిలో- ఎప్పుడు చూశాను? ఎక్కడ చూశానని ప్రశ్నించుకొన్నాడు...కానీ సమాధానం దొరకలేదు. ఏదో తెలియని ఆత్మీయత, అవ్యాజానురాగం కలుగుతున్నాయి చతుర్వేదిలో జీవితంలో మొదటిసారిగా తను బ్రౌన్ను కలుస్తూన్నప్పటికీ, తనలో అలాంటి విచిత్రానుభూతి ఎందుకు కలుగుతూందో అర్థంకాలేదు. మళ్ళీ ఒకమారు బ్రౌన్ ముఖంకేసి పరకాయించి చూశాడు. అవును- సరిగా అవే కళ్ళు; అదే ముఖం; అవే పెదాలు; అవన్నీ తాను ఎరిగున్నవే. నవ్వినపుడు అతడి బుగ్గలమీద పడుతూన్న సొట్ట తను ఎప్పుడో ఎక్కడో చూచినట్లు లీలగా గుర్తు. సముద్రాలు దాటి కొన్ని వేల మైళ్ళ దూరంనుంచి వస్తూన్న బ్రౌన్ను యింతకుక్రితం చూడటం తన కెలా సంభవం? ఇదేదో మానవమేథస్సుకు అందని మిస్టరీలాగా తోచింది.

"మీకు శ్రమయిచ్చా ననుకొంటాను" అన్నాడు బ్రౌను శబ్దాన్ని భంగ పరుస్తూ. కాస్త అమెరికన్ స్లాంగ్ తప్పిస్తే, అతని ఉచ్చారణంతా భారతీయునిలాగే వుంది.

"నో... నో... శ్రమేమీ లేదు- మిమ్మల్నిలా కలుసుకొన్నందుకు చాలా సంతోషంగా వుంది.

ఇద్దరూ లౌంజ్ దాటి కారు సమీపించారు. లగేజ్‌తెచ్చి కారు డిక్కీలో

పెటాడు కూలీ. బ్రౌను లగేజ్ తెచ్చిన కూలీకు అయిదు రూపాయలిచ్చాడు.

"ఇండియన్ కరెన్సీ మీరు బొంబే లోనే మార్చుకొన్నట్లుంది" అన్నాడు చతుర్వేది స్టీరింగు వీల్ దగ్గర కూర్చుని కారు స్టార్టు చేస్తూ.

"అవును. అలా మార్చుకొంటే ఇండియాలో ప్రయాణం సులువుగా వుంటుందని మా మమ్మీ చెప్పింది."

కారు సిటిలో వస్తున్నంత సేపు బ్రౌన్ ఏమీ మాట్లాడలేదు. నగర సౌందర్యాన్ని చూస్తూన్నాడు. దార్లో బ్రౌనుకు సిగిరెట్ ఆఫర్ చేశాడు చతుర్వేది.

"నో. థ్యాంక్స్ ఐ డోంట్ స్మోక్ బిఫోర్ ఎల్డర్స్" అన్నాడు బ్రౌను.

యల్. యస్. డి లాంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి నాగరికత పేరిట నానాహంగామా చేసే యువకులు కోకొల్లలుగా కనిపించే అమెరికాలో పుట్టి పెరిగిన ఒక యువకుడు, పెద్దలముందు సిగిరెట్ కాల్చననడం చతుర్వేదికి వింతగా కనిపించింది- ఇంత కఠిన క్రమశిక్షణలో పెంచి పెద్దచేసిన బ్రౌన్ తలిదండ్రులను మనసులో శ్లాఘించకుండా వుండలేకపోయాడు. బ్రౌన్ పట్ల ఓరకంగా గౌరవభావమేర్పడింది.

"సిటీ ఈజ్ ఫుల్ ఆఫ్ ఓరియంటల్ కల్చర్" అన్నాడు బ్రౌన్.

"నిజమే నగరం నిన్నటి మొన్నటి దాకా ముస్లిం పరిపాలన క్రింద వుండేది- అందుకే యిక్కడ ఎక్కువగా ముస్లిం నాగరికతా లక్షణాలు కనిపిస్తాయి."

'మా మమ్మీ చెప్పేది దక్షిణ భారతంలో దేవాలయాలమీద అపురూపశిల్పకళాఖండాలుంటాయని. కూచిపూడి, కథాకళీలాంటి నృత్యశాస్త్రం చాల ప్రసిద్ధ



మైందని. జీవితంలో ఒక్కసారయినా అలాంటి నృత్యప్రదర్శనం చూచి తీరాల్సిందని అంటూండేది. నిజమేనా?"

"అవును. ఆ నృత్య ప్రదర్శనలు నిసలైన భారతీయ నాగరికతకు మచ్చుతునకల్లాంటివి- కాని సరయిన ఆదరణ, పోషణలేక అవి కాలచక్రంలో మరుగున పడిపోయాయి. కానీ ఇప్పుడిప్పుడే ప్రభుత్వం ఆ శాస్త్రంపట్ల శ్రద్ధవహించి పునరుద్ధరించాలని చూస్తూంది."

ఆ ఉదయమే హోటల్ రిట్జ్‌లో బ్రౌన్‌కోసం ఒక కాటేజ్ రిజర్వు చేయించాడు చతుర్వేది కారు కాటేజ్‌ని సమీపించింది. హోటల్‌బాయ్ లగేజ్ తెచ్చి కాటేజ్‌లో వుంచాడు. బేరర్‌ను పిల్చి ఒక పాట్ కాఫీకి ఆర్డరిచ్చాడు చతుర్వేది- చాలా సేపటి వరకూ వాళ్ళ సంభాషణ హైదరాబాదు నగరమూ, దాని పుట్టుపూర్వోత్తరాల మీద జరిగింది హంపీ, ఎల్లోరా, అజంతా, మహాబలిపురం అమరావతీ పట్టణాలు ఒకప్పుడు ఎంత వైభవోపేతంగా ఆయా రాజుల కాలంలో విరాజిల్లిందీ, చతుర్వేది వివరంగా ఇంగ్లీషులో వివరిస్తూంటే, బ్రౌను ఎంతో ఆసక్తితో వినసాగాడు. అనాటి వైభవానికి, ఆ రోజుల కళాభిజ్ఞతకు నిదర్శనంగా కాలగర్భంలో కలిసిపోకుండా ఈనాటికీ నిల్చియున్న అపూర్వ శిల్ప కళాఖండ విన్యాసాలను గురించి చతుర్వేది అనర్గళంగా మాట్లాడుతూంటే, బ్రౌన్ శ్రద్ధాసక్తులతో వింటున్నాడు.

ఈ ధోరణిలో దాదాపు అర్ధగంట పైగా వాళ్ళ సంభాషణ కొనసాగినా, బ్రౌన్ తను ఇండియాకు ఎందుకు వచ్చిందీ, చతుర్వేదిని ఎందుకు కలుసుకోవాలనుకొన్నదీ చెప్పలేదు కాలం గడిచేకొద్దీ చతుర్వేదిలోని ఉత్కంఠ ఎక్కువ కాసాగింది. చివరకు చతుర్వేది తన ఆదుర్దాను అణచుకోలేక "మిస్టర్! బ్రౌన్! నేనొక ప్రశ్న అడుగుతాను. మరోవిధంగా అనుకోకండి- మీరిక్కడకు రాకముందు, మీరెవ్వరో నాకు తెలీదు- నిన్నరాత్రి మీ దగ్గరనుంచి కేబిల్ రాగానే ఆశ్చర్యపోయాను. పనిగట్టుకొని మీరెందుకు ఇండియా వస్తున్నారో నన్నెందుకు కలుసుకోవాలనుకొంటున్నారో నా వూహ కందడం లేదు" అన్నాడు చతుర్వేది.

ఆ ప్రశ్న వినేసరికి అంతదాకా ప్రేలుతూ నవ్వుతూన్న బ్రౌన్ ముఖం వివర్ణమయింది మ్లానమయిన అతడి ముఖంలో అంతకు క్రితం కొన్ని క్షణాల వరకూ వున్న ఆనందరేఖ మాయమయింది. గంభీర ముద్ర వహించాడు. చతుర్వేది అడిగిన ప్రశ్నకు సమాధాన మివ్వకుండా తన ట్రంకు పెట్టెలోనుంచి ఒక బ్రీఫ్‌కేస్ తీసి చతుర్వేదికి అందిస్తూ. "మా మమ్మీ ఈ బ్రీఫ్‌కేస్ మీకు అందచేయమంది"

అన్నాడు. అతడి గొంతు గద్గదిక మయింది. కన్నులశ్రుపూరితాలయ్యాయి.

చతుర్వేదికి బ్రౌన్ ప్రవర్తన విచిత్రంగానూ అసూహ్యంగాను కనిపించింది. అసలీ బ్రౌన్ అనే వ్యక్తి ఎవర్ తనకు తెలీనప్పుడు- వాళ్ళ మమ్మీ పనిగట్టుకొని తనకో బ్రీఫ్‌కేస్ అందదేయమనడం మరీ ఆశ్చర్యాన్ని గొలిపింది.

"ఎక్స్‌క్యూజ్ మీ ! మిస్టర్ బ్రౌన్ ! మీ మమ్మీ ఎవరో నాకు తెలీదు- అంతకన్నా మీ మమ్మీ నాకో బ్రీఫ్ అందచెయ్యమని మిమ్మల్ని ఇండియాకు పంపటంలో ఆమె అంతర్యమేమిటో అర్థం కావటంలేదు. ఇంతకూ మీ మమ్మీ ఎవరు ? ఆమె ఎక్కడుంది ! ఏం చేస్తూంది" అని ప్రశ్నాపరంపరలు కురిపించాడు చతుర్వేది.

సోఫాలో సర్దుకొని జీరబోయిన గొంతులో బ్రౌన్ తన రాకకు కారణం చెప్పటం మొదలెట్టాడు.

"మా మమ్మీకి రెండేళ్లక్రితం పెద్ద జబ్బుచేసింది. ఆ జబ్బుతోనే ఆమె చనిపోయింది. చనిపోయిన ఆఖరు ఘడియ వరకూ మా మమ్మీ ఇండియాకు రావాలని తహతహలాడిపోయేది. కానీ పరిస్థితులనుకూలించక ఆమె ఇండియాకు రాలేకపోయింది. నేనెన్నోసార్లు ఆమెను అడిగాను. ఇండియాకూ, నీకూ వున్న అనుబంధం ఏమిటి ? ఎందుకు ఇండియాకు పోవాలనుకొంటున్నావని. కానీ సమాధానంగా ఒక మ్లానం హాసం చేసి వూర్కొనేది. ఆ నవ్వు వెనకాల కొన్ని కోట్ల అగ్ని పర్వతాలు బద్దలయినట్లూ, కొన్ని వేల దావాగ్నులు ప్రజ్వరిల్లి నట్లనిపించేది- ఓజస్సు లేని కాగితం పువ్వు లాంటి ఆ నవ్వు వెనకాల ఏదో ఒక బాధా పరితప్తమయిన నిగూఢ చరిత్ర దాగి వుందనిపించేది. మళ్ళీ ఏనాడూ ఆ విషయం ఆమె ముందు ప్రస్తావించలేదు. అసలావిషయాన్ని నేను పూర్తిగా మరిచిపోయాను. కానీ ఒకనాడామె నన్ను తన గదికి రమ్మంది- అప్పటికి ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోయింది. డాక్టర్లు కూడా ఆమె యింక ఎక్కువ రోజులు బ్రతకదని చెప్పారు. ఆమె కోరిక ప్రకారం ఆమె గదికి వెళ్లాను. అప్పుడామె చాలా బలహీనస్థితిలో వుంది. పడకమీదనుంచి లేచే ఓపిక కూడా లేదు. నన్ను చూడగానే దగ్గరకు రమ్మని పిల్చికడి- తన సూట్‌కేస్ తీసుకొని రమ్మంది- ఆమె చెప్పినట్లే చేశాను బ్రీఫ్‌కేస్ నా చేతికిస్తూ, "చూడు బ్రౌన్ ఈ బ్రీఫ్‌కేస్ నా ప్రాణంకన్నా చాలా విలువయింది. దీన్ని నేనెంతో పదిలంగా నా ప్రాణంకన్నా ఎక్కువగా యింతకాలం కాపాడాను- కానీ నా ఆరోగ్య పరిస్థితి చూస్తే, నేనెక్కువ కాలం బ్రతికేట్లు లేదు- రేపో మాపో అన్నట్లుగా వుంది నా పని- నా తదనం

తరం. నువ్వీ బ్రీఫ్‌కేస్‌ను ఇండియాలో వుంటూన్న చతుర్వేదిగారికి అంద చేయాలి- నాకు నువ్వీ సహాయం చేసి పెడ్తావన్న నమ్మకం నాకుంది. ఇది నీ తల్లి తుది కోరిక. నువ్విది తప్పక నెర వేర్చాలి- ఆయన్ను కలుసుకొనే వరకూ నువ్వీ బ్రీఫ్‌కేసును ఏ పరిస్థితులలోను తెరవకూడదు. ఈ విషయం మరెవ్వరికి చెప్పనని ప్రమాణం చెయ్యాలి" అంది. ఆమె చెప్పినట్లే చేశాను. ఆమె ఆఖరి కోరికను నెరవేర్చటం నా బాధ్యతని నిర్ణయించుకొన్నాను.

ఇది జరిగిన రెండ్రోజులకు మా మమ్మీ శాశ్వతంగా కన్నుమూసింది. ఆ తర్వాత నేనెన్నోమార్లు ఇండియాకు రావాలనీ మిమ్మల్ని కలుసుకోవాలని ప్రయత్నించాను. కానీ ఫలించలేదు. ఇండియాకు వెళ్లేందు కయ్యే ఖర్చుల నిమిత్తం, మా మమ్మీ నాకు డబ్బుకూడా యిచ్చింది. అయినా ఎప్పటి కప్పుడు నా యిండియా ప్రయాణం వాయిదా వెయ్యాల్సి వచ్చేది. ఇటీవం మా యూనివర్శిటీ ఫ్రెండ్సు కొంతమంది కల్చరల్ టూరు మీద యిండియాకు వెడుతూన్నట్లు తెలిసింది నేనూ వాళ్ల టూరులో కలిశాను. చివరి కీనాటికి మిమ్మల్ని కలుసుకొనే భాగ్యమూ, మా మమ్మీ చివరి కోరిక నెరవేర్చే అవకాశమూ కలిగాయి" అని ముగించాడు బ్రౌన్. అతడి మాటల్లో ఆవేదన ప్రస్ఫుటంగా ధ్వనించింది-

చతుర్వేది బ్రీఫ్‌కేస్ తెరిచాడు. అందులో ఒక పాత ఫోటో ఆల్బం, ఒక సీల్డు కవరున్నాయి. కవరు మీద "శ్రీ. చతుర్వేది ఐ.సి.యస్. రిటైర్డు బోర్డు మెంబరు, బంజారాహిల్స్ హైదరాబాదు" అని ముత్యాల కోవల్లాంటి అక్షరాలతో తన పూర్తి చిరునామా రాసుంది అక్షరాలున్న తీరును బట్టి, అది ఆడవాళ్ల దస్తూరీ అని తెలుస్తూంది. ఫోటో ఆల్బం ఢిల్లీలో కొన్నట్లుగా వుంది.

చతుర్వేది ఆల్బం యదాలాపంగా తిరిగేశాడు ప్రతి పేజీలో ఇండియాలోని ఏ ప్రముఖ చారిత్రికమయిన కట్టడమో, ఏ శిల్పకళా ఖండమో, ఏ రమణీయ ప్రకృతి దృశ్యమో కనిపించాయి. కున్ని పేజీలు తిరగేశాడు హఠాత్తుగా చతుర్వేది దృష్టి ఒక పేజీ దగ్గర ఆగిపోయింది. తదేకంగా ఆ ఫోటోవంక చూశాడు- అదొక అమెరికన్ యువతి ఫోటో- ఆ ఫోటోను చూడగానే చతుర్వేది హృదయాంతరాళాలలో ఏదో స్పందన, ఏదో చిత్రాతి చిత్రమయిన పూర్వానుభూతి కలిగాయి. ఆ ఫోటోలోని స్త్రీమూర్తిని ఇంతకు పూర్వం తనెక్కడో చూశాడు- అవే కళ్లు అదే నవ్వు. కాని ఎక్కడ ఎప్పుడు ఆ స్త్రీ మూర్తిని తను చూశాడో జ్ఞప్తికి రావటం లేదు. గత జన్మలోనయినా తను ఆమెను చూచివుండాలి Parascychology సిద్ధాంత రీత్యా మానవుడికి మరో జన్మ



వుండంటున్నారు. సెక్సు సైన్సు వల్ల మానవుడికి పూర్వజన్మస్మృతి వుంటుందట– బహుశా, గత జన్మలో ఈమె నాకు అత్యంత సన్నిహితురాలై వుండొచ్చు– ఈ తీరులో సాగాయి చతుర్వేది వూహలు బ్రౌన్‌కు ఆడవేషం వేసి ఫోటో తీస్తే, అచ్చం ఆ ఫోటోలోని స్త్రీమూర్తిలాగే వుంటాడనిపించింది చతుర్వేదికి. మళ్ళీ ఒకమారు బ్రౌన్ ముఖంవంక ఆ ఫోటోలోని స్త్రీమూర్తి వేపు చూశాడు.

"ఏమిటలా చూస్తున్నారు– ఆ ఫోటోలో వున్నామె మా మమ్మీ" అన్నాడు బ్రౌన్.

"అదే అనుకొన్నాను– ఫోటోలోని స్త్రీమూర్తికి మీకూ చాలా దగ్గర పోలిక లున్నాయి" అన్నాడు చతుర్వేది సీల్డు కవరు చింపుతూ. చతుర్వేది వుత్తరం చదువసాగాడు.

ఉత్తరం చదుతూన్నంతసేపు చతుర్వేదిలో ఎన్నెన్నో అనుభూతులు కలిగాయి. గతమంతా ఒక్కసారి కళ్ల ముందు మెదిలింది. జాబులోని ఏదో విషాద సన్నివేశం చదువుతూన్నపుడు, చతుర్వేదిని ఆ సంఘటన పూర్తిగా కదిల్చివేసేది– మధురఘట్టం వచ్చినప్పుడు. తీయని స్మృతులతో పులకితుడయ్యేవాడు. అపుడపుడూ అతని పెద

వులపైన యాదృచ్ఛికంగా చిరునవ్వు తొంగిచూసేది, సర్వీసులో చేరిన క్రొత్తల్లో, వేసవి సెలవులకు తను ఊటీకి వెళ్ళటం, అక్కడ కాలం గడపటం, ఆ పర్వత ప్రాంతాల రమణీయ ప్రకృతి దృశ్యాలు ఒక్కమారు చతుర్వేది మనఃఫలకంమీద కదిలాయి.

చతుర్వేది వుత్తరం చదువుతూన్నంతసేపు బ్రౌన్ చతుర్వేది ముఖ కవళికలను గమనించసాగాడు. చతుర్వేది ప్రవర్తన చాలా వింతగా కనిపించింది. ఎక్కడో అమెరికాలోని తన తల్లికి, ఈ భారతీయుడికీ ఏమిటీ అవినాభావ సంబంధం ? ఉత్తరం చదవగానే ఎందుకితడిలా క్రుంగిపోతున్నాడు. ఆ వుత్తరం ఎవరు రాశారు ? అందులో ఏం రాసుంది. ఇలాంటి ప్రశ్నలెన్నో బ్రౌను మెదడులో రేకెత్తాయి. కానీ వాటికి సమాధానం దొరకలేదు. చివరకు చతుర్వేది కను కొనలలో నిల్చిన కన్నీటి బిందువులను తుడుచుకొంటూ "మాడు బాబూ! నిన్ను చూసిన మొదటి క్షణంలోనే నాకెందుకో నీమీద అవ్యాజమయిన అనురాగం కలిగింది. నిన్ను చూసినపుడు నా మొదటి పిల్లవాడు గుర్తుకొచ్చాడు. అతడు బతికుంటే, ఈ సరికి నీ వయసంత వుండేది. కాని దురదృష్టవశాత్తు వాడిప్పుడు లేడు. నాలుగేళ్ళ పిల్లవాడుగా వున్నడు.ప్పు వాడొకసారి వాళ్ళ తాతయ్యతో తిరునాళ్ళకు వెళ్ళాడు- ఆ జనంలో వాడు తప్పిపోయాడు. వాణ్ణి వెతికించడానికి ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాను. కానీ మా ప్రయత్నాలేవీ ఫలించలేదు- చివరకు వాడిమీద పూర్తిగా ఆశలు వదులుకొన్నాను. వాడిప్పుడు బతికున్నాడో లేదో కూడా తెలీదు. వాడు లేని కొరత నిన్ను చూసినపుడు తీరిపోయింది. నాదొక కోరిక నా జీవిత చరమాంకంలో. వాడు లేని కొరత నీలో చూసుకొంటూ; ఆఖరి రోజులు గడిపే అవకాశం నాకివ్వు నువ్వు నామాట కాదనవని నాకు తెలుసు- నీవు నాతోబాటే వుండిపో- ఇక్కడ నీకు కావల్సిన ఏర్పాట్లు అన్నీ చేస్తాను" అన్నాడు చతుర్వేది.


చతుర్వేది గొంతు బొంగురుపోయింది మాట పెకిలిరావటంలేదు.

తల్లి పెంపకంలో భారతదేశమన్నా భారత ప్రజలన్నా గౌరవప్రపత్తులు పెంపొందించుకొన్న బ్రౌన్ చతుర్వేది కోరికను కాదనలేక పోయాడు చివరకు ఇండియాలో వుండిపోవాలని నిర్ణయించుకొన్నాడు.

కాలచక్రంలో కొన్నాళ్ళు గడిచిపోయాయి. ఇపుడు బ్రౌన్ వేషం, భాష ఆచార వ్యవహారాలు అన్నీ మారిపోయాయి. సూట్లు మానేసి, పంచెకట్టు, ధోవతికి అలవాటుపడిపోయాడు. తెలుగు ట్యూటరును ఏర్పాటుచేసుకొని,

తెలుగు వ్రాయటం మాట్లాడటం నేర్చుకొన్నాడు. బ్రౌన్ ఇపుడు చతుర్వేది యింట్లోనే వుంటున్నాడు. ఆ యింటి కుటుంబ సభ్యుడుగా మారిపోయాడు. కాని చతుర్వేది బంధు వర్గానికీ, అతని కొడుకులకూ ఈ పద్ధతి నచ్చలేదు. చతుర్వేది యింటికి రావటం కొడుకులూ, బంధువర్గమూ పూర్తిగా మానేశారు. ఒక విధంగా తన ఆత్మీయులనుకొన్న వాళ్ళందరూ చతుర్వేదిని వెలివేశారు. ఇపుడు చతుర్వేది పూర్తిగా ఒంటరి వాడయ్యాడు ఆ యింటికంతటికీ తనూ, బ్రౌన్, నాయర్ మాత్రమే మిగిలిపోయారు. అయినా చతుర్వేది బాధపడలేదు — అయినవాళ్ళూ, ఆత్మీయులూ తనతో సంబంధ బాంధవ్యాలు తెగతెంపులు చేసుకొన్నా, బ్రౌన్‌ను చేరదీసి అతని కొరకు అండ ఏర్పాటుచేయుగలిగానన్న సంతృప్తి మిగిలింది ఒక పరదేశస్తుణ్ణి చేరదీసి కన్నకొడుకకన్నా ఎక్కువగా చూస్తున్నావని ఎవరయినా నిలదీసి అడిగినప్పుడు, తను వాళ్ళకు సరైన సమాధానం చెప్పలేకపోవచ్చు. కానీ ఎక్కడో తన హృదయాంతరాళాలలో దాగున్న కరుణ, అనురాగం, బ్రౌన్ను తనవాణ్ణిగా చేసుకోమని ప్రేరేపించాయి. అందుకే ఎవ్వర్నీ ఖాతరు చేయకుండా బ్రౌన్ను తనింట్లోనే వుంచుకున్నాడు.

ఒకసారి చతుర్వేది చెల్లెలి కూతురు



ఉష హైదరాబాదు రావటం తటస్థించింది. సరాసరి చతుర్వేది యింటిదగ్గరే దిగింది. ఇంతకు పూర్వం ప్రతి వేసవి సెలవులకు హైదరాబాదు రావటం, మావయ్య యింట్లోనే సెలవులు గడపటం ఉషకు అలవాటు — కాని బ్రౌన్ ఆ

యింట్లో చేరిన నాటినుంచీ ఉష హైదరాబాదు రాలేదు. కాకినాడలో ఉష బి ఏ. చదివి పట్టభద్రురాలైంది. చదువు, చదువుకు తగ్గ వినయ విధేయ తలు, సంస్కారమూ వున్న వ్యక్తి ఉష. చాలా సోఫిస్టికేటెడ్‌గా వుండేది-ఉప్పొంగి పోతున్న గోదావరి పొంగులా మిసమిస లాడే యౌవనమూ, చక్రాల్లాంటి అంద మయిన కళ్ళు, ఎదుటివాణ్ణి యిట్టే ఆకర్షించగలవు. ఇంతటి స్నిగ్ధ సౌందర్యరాశిని ఒక్కసారి చూసేసరికి ఎవరి కళ్ళయినా చెదిరిపోగలవు

ఉన్నట్లుండి, సూట్‌కేసుతో టాక్సీలో నుంచి తన వాకిట ముందు దిగిన ఉషను చూసేసరికి చతుర్వేది సంభ్రమాశ్చర్యా లకు అవధులు లేకపోయాయి.

"ఏం, మావయ్యా ?! బాగున్నారా" అంది వస్తూనే ఉష.

"ఆఁ - బాగానే ఉన్నాను. ఏంటిలా చెప్పా పెట్టకుండా ఊడిపడ్డావ్---ఇలా వస్తున్నానని నాకో కార్డుముక్క రాస్తే, నేను స్వయంగా స్టేషనుకు రాక పోయానా తల్లీ! అయినా నీ పద్ధతి నాకేం బాగోలేదమ్మా ! ఆఁ—అన్నట్టు మీ అమ్మ కులాసాయేనా ?"

"అదే బాగు మావయ్యా ! రెణ్ణెళ్ళ క్రితం అమ్మకు టైఫాయిడ్ వచ్చింది— అప్పణ్ణుంచీ పడకమీదనుంచి లేవటం లేదు......"

"ఏవమ్మా ! నాకు తెలీకడుగుతాను. మీ మావయ్య బతికే ఉన్నాడు గదా! ఇలా అయిందని నాకొక ముక్క రాస్తే ఏం పోయిందమ్మా"

రాయాలనే పోస్టాఫీసు నుంచీ కవరు తెప్పించింది - మళ్ళీ ఎందుకో రాయడం మానేసింది —— బహుశా అభిమానం అడ్డొచ్చి వుంటుంది."

"ఏమిటోనమ్మా ! మరీను - ఏం అంత అభిమానం అడ్డు రావల్సిన కాని పని నేను మాత్రం ఏం చేశానమ్మా ! బ్రౌన్ను నా యింట్లో వుండనిచ్చాననేగా మీ కందరికీ కోపం - ఏం తప్పా ? అతణ్ణి చూసి ఒక్కసారి పరిచయ మయితే, మీ మావయ్య చేసిన పనిని నువ్వు కూడా హర్షిస్తావమ్మా ! అయినా మీ మావయ్యను నీవు మొదటినుంచీ, ఎరుగుదువుగా ! కారణం లేకుండా ఈ మావయ్య ఏ పనీ చేయడమ్మా ! ఆ కారణమేమిటో, మీ మావయ్య ఎందు కిలా చేశాడో తర్వాత తర్వాత నువ్వే తెలుసుకుంటావ్ - అప్పుడు మీ మావయ్య చేసిన పని సరయిందని నువ్వే అంటా వమ్మా ! ఊఁ - ఈ గొడవలెప్పుడూ వుండేవేలేమ్మా ! ముందు నువ్వెళ్ళి స్నానం వగైరా కానివ్వు - బ్రౌన్ వచ్చే వేళ కూడా అయింది. అతడు రాగానే అందరం కలిసి లంచికూర్చుందాం."

మాటల్లోనే బ్రౌన్ వచ్చాడు హాల్లో ఒక అపరిచిత స్త్రీతో చతుర్వేది మాట్లా డుతూ వుంటం చూసి, సరాసరి మేడ

పైదికి వెళ్ళబోయాడు. కాని ఇంతలో చతుర్వేది బ్రౌన్ను పిలిచాడు. "చూడు మిస్టర్ బ్రౌన్! ఈ అమ్మాయి నా మేనకోడలు ఉష – ఇటీవలే యం. ఏ. యూనివర్సిటీకంతా ఫస్టుగా ప్యాసయింది" అని పరిచయం చేశాడు.

ఉష ఒక్కమారు కళ్ళార్పకుండా బ్రౌన్ వేపు చూసింది. ఆరడుగుల ఎత్తు – పచ్చని దేహచ్ఛాయ – ఎవర్నయినా ఆకర్షించగలిగే కళ్ళు – ఆ ఎత్తుకు తగ్గ హుందాతనం – మొదటి చూపులోనే మంచి స్ఫురద్రూపి అనిపించే అతడి అందాన్ని చూసి మంత్రముగ్ధురాలయి చూపు మరల్చుకోలేకపోయింది ఉష. పొందూరు ఖద్దరు ధోవతి కట్టి ఖద్దరు లాల్చీతో వున్న బ్రౌన్ను చెబితే తప్ప ఎవరూ అతణ్ణి అమెరికన్ అనుకోరు. ఆ వేషధారణ బ్రౌనుకు బాగా నప్పినట్లుంది.

సరదాగా కబుర్లు చెప్పుకుంటూ లంచి ముగించారు వాళ్ళు సంభాషణలో భారతదేశం. దాని ప్రాచీన ఔన్నత్యం, తరతరాలుగా ఆధ్యాత్మికపథంలో పురోగతిని సాధిస్తూన్న భారతదేశ ఆధ్యాత్మిక దృక్పథం, పాశ్చాత్య వ్యామోహానికి ప్రభావితులవుతున్న భారతదేశ యువతరం లాంటి విషయాలు దొర్లాయి –

ఆ సాయంత్రం ముగ్గురూ కలిసి ఇంగ్లీషు పిక్చరుకు వెళ్ళారు. ఉషా బ్రౌనులు ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు. సినిమా చూస్తూన్నంతసేపు ఉష బ్రౌన్ కేసి తదేకంగా చూడసాగింది – బ్రౌన్ కూడా ఉషవేపు చూసేవాడు. ఇద్దరి చూపులు కలుసుకున్నపుడు; ఏమీ ఎరగనట్లు యిద్దరూ సినిమా వేపు మరల్చేవారు – వీళ్ళిద్దరినీ ఒక కంట గమనిస్తున్న చతుర్వేది మాత్రం తనలో తాను ముసిముసిగా నవ్వుకునేవాడు – అదాటున బ్రౌన్ చెయ్యి ఉష చేతికి తగిలింది – ఆ స్పర్శలో ఏదో ఒక దివ్యానుభూతి ఒక పులకరింత కలిగాయి — తన చేతిని తీయకుండా అలాగే వుంచింది — సినిమా ముగిసింది.

"రిచర్డు బర్టన్ యాక్షన్ సుపర్బ్‌గా వుంది కదూ" అంది ఉష దార్లో, సంభాషణను సినిమాల మీదికి మరలుస్తూ.

"అతడు నిజంగా ఏస్ యాక్టర్ – అతడున్న పిక్చర్సు నేను సాధారణంగా మిస్ అవను" అన్నాడు చతుర్వేది.

"మీ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవించలేకపోతున్నాను. ఇంగ్లీషు ఫిలింవరల్డ్‌లో అతడొక మంచి యాక్టరే కావొచ్చు – కాని మీ తెలుగుగడ్డ మీద అతణ్ణి మించిన యాక్టర్స్ ఎందరో వున్నారు – ఉదాహరణకి రాఘవను తీసుకోండి. బళ్ళారి రాఘవ మహానటుడే నటగా – పూర్వకాలం అతడు షేక్స్పియరు నాటకాలాడే వాడట – చాలా అద్భుతంగా తన నటనా శక్తితో నాటకాన్ని రక్తి

కట్టించేవాడట. పూర్వమొకసారి మా మమ్మీ అతడి నాటకాన్ని చూసిందట - ఆమె చనిపోయేవరకూ అతడి నటనా కౌశలాన్ని అతడి వాచకాన్ని తెగమెచ్చు కొనేది -

అమెరికన్ పౌరుడైయుండి కూడా తెలుగు నటకులన్నా, తెలుగు నాటకా లన్నా సదభిప్రాయం వెలిబుచ్చిన బ్రౌన్ మాటలకు ఆశ్చర్యపడటం ఉష వంత యింది.

"రియల్లీ ! మీరు నిజంగానే ఈ మాటలంటున్నారా" అంది ఉష తన ఆశ్చర్యాన్ని అణుచుకోలేక.

"యస్. మిస్. ఇప్పటికీ మా దేశంలో మీ నాటకాలన్నా, మీ భరతనాట్యం, కథాకళి, కూచిపూడి నృత్యాలన్నా జనం పడిచస్తారు మీ నాటకాలు ప్రజాజీవి తానికి ప్రతిబింబాలు - నిజజీవితానికి చాలా సన్నిహితంగా వుంటూ, ఒక ఆదర్శాన్ని, ఒక సందేశాన్ని అందించే మీ సినిమాలన్నా, మీ నాటకాలన్నా నాకు చాలా యిష్టం - నాకే కాదు మా దేశంలో చాలామందికి యిష్టం - ఇహ పోతే మా హాలీవుడ్ పిక్చర్సంటారా ? వాటిల్లో మీకు కనిపించేవి మోతాదును మించిన సెక్స్ అపీల్ - క్రిమినల్ టెంపరమెంట్ - నన్నడిగితే అలాంటి చిత్రాలు చూడటంవల్ల ప్రజల్లో ఒక రకమైన మానసిక దౌర్బల్యం ఏర్పడు తుందంటాను - అలాంటి సినిమాలు చూసి ప్రభావితులై, మా దేశంలోకూడా ఎంతోమంది యువకులు నిజజీవితంలో కూడా దొంగలూ ఖూనీకోర్లు అయిన సంఘటనలు లేకపోలేదు - అందుకే ఐ హేట్ హాలీవుడ్ పిక్చర్స్" అన్నాడు బ్రౌను.


బ్రౌన్ మాటల్లోని వుద్వేగాన్ని, తీవ్రతను గమనించిన ఉష, బ్రౌనంటే మరింత అభిమానం పెంచుకొంది.

"మిస్టర్ బ్రౌన్, మా దేశంపట్ల మా నాట్యకళలపట్ల, మా దేశం నటులమీద అలాంటి సద్భావం గౌరవం వుండటం చాలా అరుదు. ఎంతో విశాలహృదయు దయితేనే తప్ప, ఎదుటివాళ్ళ ఉన్నతిని గొప్పతనాన్ని గుర్తించలేరు - నిష్పాక్షి కంగా మా కళలపట్ల మీరు చేసిన వ్యాఖ్యకు నా జోహార్లు" అంది ఉష అభినందనపూర్వకంగా.

"థ్యాంక్స్ ఫర్ యువర్ కాంప్లి మెంట్స్- నేనీనాడు మీ దేశ వున్నతిని గుర్తించగలిగానంటే, దానికి కారణం మా మమ్మీ — చిన్నప్పటినుంచీ ఆమె పెంపకంలో పెరిగిన నేను చిన్నతనం నుంచీ భారత్ అంటే అభిమానం పెంచు కొన్నాను. మీ దేశ నాయకులయిన మహాత్మా గాంధీ, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేలు లాంటి మహా మేధావుల జీవితాల గురించి క్షుణ్ణంగా తెలుసు కొన్నాను. వాళ్ళు వ్రాసిన గ్రంథాలన్నీ చదివి జీర్ణించుకొన్నాను. మహాకవి



యువ



రవీంద్రనాథ ఠాగూర్ లాంటి కవుల రచనలను కూలంకషంగా చదివి ఆకళింపు చేసుకొన్నాను. మీ దేశంలో జరిగే రాజకీయ, సాంఘిక మత పరిణామాలను ఎప్పటికప్పుడు మీ పత్రికల ద్వారా ఆసక్తితో చదివి అర్థంచేసుకొన్నాను. అందుకే మీరన్నా మీ దేశమన్నా నాకంత అభిమానం. చతుర్వేది గారు నన్ను యిండియాలో వుండిపొమ్మనటమే తడవుగా, నేనీ దేశపు పౌరుణ్ణి కాదలచుకొన్నాను. ఇటీవల మీకెవ్వరికీ తెలియని ఒక సాహసచర్య చేశాను. తండ్రితో సమానుడయిన చతుర్వేది గారికి కూడా నేనీ సంగతి చెప్పలేదు."

(సశేషం)

# 'తెలుసుకున్న తెలుపెట్టాలు'

## సి. విశ్వేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

"ఏమి టేమిటని" ఉషా చతుర్వేదు లొక్కసారే ప్రశ్నించారు ఆదుర్దాగా.

"నేను ఆర్యసమాజ్ ద్వారా హిందూ మతం పుచ్చుకొన్నాను - నాకు తెలుసు, ఈ వార్త మా దేశంలో గొప్ప సంచలనం కలిగిస్తుందని - అయినా నేనీ సాహసాని కొడిగట్టాను."

ఈ వార్త ఉషా చతుర్వేదులను చకితుల్ని చేసింది. పుట్టుకతో భారతీయు డైకూడా, ఈ దేశ నాగరికతను సంస్కృతిని ఏవగించుకొని పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలో పడి పెడ ద్రోవలు తొక్కుతూన్న ఈనాటి భారత దేశ యువతరంతో పోల్చి చూచినపుడు, బ్రౌన్ వాళ్ళ కళ్ళకు ఒక మహత్తర ఆదర్శమూర్తిగా కనిపించాడు. ఆందుకో తేని హిమవన్నగ శిఖరంగా తోచాడు. బ్రౌన్ సాహస చర్యను వేనోళ్ళ అభినందించారు.

రోజులు గడుస్తూన్నకొద్దీ, ఉషా బ్రౌనులు సన్నిహితులయ్యారు. అనుబంధాలు పెంచుకొన్నారు. అనురాగ లతతో రెండు హృదయాలను ఏకంచేసి బంధించుకొన్నారు. ఇద్దరూ కలిసి, సినిమాలకు షికార్లకు పిక్నిక్కులకు వెళ్ళేవాళ్ళు ఎక్కడకు వెళ్ళినా జంటగా వెళ్ళేవాళ్ళు — ఒకరి మనసు లొకరు పూర్తిగా అర్ధంచేసుకొన్నారు వాళ్ళిద్దరి మధ్య మొలకెత్తుతున్న ప్రేమానురాగాలు మొదట్నుంచీ గమనిస్తూన్నప్పటికి చతుర్వేది ఏమీఅనేవాడుకాడు. ఒక విధంగా వాళ్ళలా వుండటం చతుర్వేదికి సంతోష దాయకమయింది. అభిప్రాయాలలో అభిరుచులలో పరస్పరం వైరుధ్యంగల రెండుదేశాల యువతీయువకులు ఒకింటివారు కావటం, మూఢాచారాలు మూఢాభిప్రాయాలతో కరడుగట్టుకొన్న భారత దేశంలో జరగటం అసంభవమని చతుర్వేదికి తెలుసు అయినా, విద్యావంతులూ, సభ్యతా సంస్కారమున్న వాళ్ళిద్దరూ ఒకటయిన రోజున, ఈ సంఘమూ, అనాదిగా మనలో పాతు

కొనిపోయిన సాంప్రదాయాలు వాళ్ళను వేరుచేయలేవు. అది తెలిసిన చతుర్వేది వాళ్ళిద్దరి కలయికకు ప్రోత్సాహమిచ్చే వాడు

క్రమేపి, ఉషా బ్రౌనుల మధ్య జరుగుతున్న ప్రేమకథ, కాకినాడలోని చతుర్వేది చెల్లెలి చెవిజాశా వెళ్ళింది. ఆమె వెంటనే ఘాటుగా చతుర్వేదికొక ఉత్తరం రాసింది.

"అన్నయ్యా! పెద్దవాడవు నీవున్నావన్న ధైర్యంతో ఒంటరిగా ఉషను నీ యింటికి పంపాను. కాని నాకు తెలుస్తూన్న వార్తలనుబట్టి, ఉషాబ్రౌనులు ఒకర్నొకరు ప్రేమించుకొంటున్నారని, వాళ్ళప్రేమాయణానికి నీ ప్రోద్బలం కూడా వుందని తెలుస్తూంది. పెద్దవాడవు నువ్వుండికూడా, యిలాంటి అప్రాచ్యపుపనులకు దోహదమిస్తున్నావంటే నాకు చాలా బాధగావుంది. మనకుటుంబమెలాంటిదో మన సాంప్రదాయమెలాంటిదో నీకుతెలుసు నువ్వు శుద్ధశ్రోత్రియ కుటుంబంలో పుట్టావు - చదువుల పేరిట విదేశాలకు వెళ్ళావు — చదువుకొన్నావు కొద్దోగొప్పో వాళ్ళసభ్యతా అభిరుచులూ నిన్ను ప్రభావితుణ్ణిచేశాయ్ - మన దేశానికి తిరిగిరాగానే గొప్పపదవిని పొందావ్ - అయినా నువ్వుమాత్రం పరజాతిస్త్రీని పెళ్ళాడేటంత నైచ్యానికి దిగజారలేదే! సాంప్రదాయంగల కుటుంబంనుంచి వచ్చిన మనవాళ్ళ అమ్మాయినే పెళ్ళిచేసుకొన్నావ్ - అప్పుడు షేమంతా ఎంతో సంతోషించాం - మన సాంప్రదాయాలకు పద్ధతులకు దూరంకాకుండా వదిన బతికినంతకాలం నిన్ను తీర్చిదిద్దింది. కాని యిపుడు వదినలేదు.

బ్రౌన్ నీ అభిమానపాత్రుడేకావచ్చు. అంతమాత్రంచేత నా కూతురిని ఆ కిరస్తానీవాడివెంట సినిమాలకు షికార్లకు పంపటం నీలాంటి సంస్కారవంతులు చేయాల్సిన పనేనా! అదేనీ కూతురైయుంటే నువ్విలాగే విచ్చలవిడిగా వదిలేయగలవా! వాళ్ళ కలయిక శ్రుతిమించి రాగాన పడకముందే, ఈ జాబును తెలిగ్గాంగా భావించి ఉషను పంపించు. ఈ చెల్లెలి అభ్యర్ధనను త్రోసిపుచ్చవని భావిస్తాను.

ఇట్లు
మీ చెల్లి లక్ష్మి."

ఇదేధోరణిలో తనయిద్దరు కొడుకుల దగ్గరినుంచీ కూతురునుంచీ జాబులు వచ్చాయ్ - అన్నీ నిందాపూర్వకంగా తనచర్యను ఖండిస్తూవచ్చిన వుత్తరాలే. ఇప్పుడు చతుర్వేదికి ఒకసమస్య ఎదురయింది-సమాజాన్ని రక్తబంధువులనూ ధిక్కరించి ఉషాబ్రౌనుల ప్రేమను మనస్ఫూర్తిగా అంగీకరించి వాళ్ళకు తన చేతులమీద పెళ్ళి చేయడమూ, లేక ఉషను వాళ్ళవూరికి పంపెయ్యటమా అన్న సందిగ్ధంలో పడ్డాడు.

ఉష పసిపిల్లేంకాదు-యుక్తవయస్కు రాలు, తన భవిష్యజ్జీవితాన్ని అనువుగా తీర్చిదిద్దుకోగల ఆలోచనా వివేకమూ వున్నాయి. అందుకే ఒకరోజు ఉషను ఏకాంతంగా పిల్చి అడిగాడు. "చూడమ్మా! మీ అమ్మ ఈరోజు జాబురాసింది బ్రౌన్‌తో నీ వివాహాన్ని నేను ప్రోత్సహిస్తున్నానట - అయినా, మంచేదో, చెడేదో నిర్ణయించుకోగల విజ్ఞానమూ, విచక్షణా నీకుంది - అందుకే నీకు నీవై ఈ సమస్యనుపరి ష్కరించుకొమ్మని వదిలేస్తున్నాను. నేనొక్కమాటడుగుతాను దాచుకోకుండా నిజం చెప్పమ్మా!"

"ఏమిటి మావయ్యా అది" అంది

"అదేనమ్మా! నీ పెళ్ళిని గురించి. బ్రౌన్ ఎలాంటివాడో నువ్వీవరకే అర్థం చేసుకొని వుంటావ్ — నా అభిప్రాయ మడిగితే బ్రౌన్ ఎంతో వివేకమూ సంస్కారం వున్న మనిషి నా కన్న బిడ్డలకన్నా అతడు నాకు ఎంతో ఆత్మీయుడయ్యాడు ఎవరో ముక్కు మొహం తెలీని ఒక విదేశీయుడు, నా కెలా ఆత్మీయుడయ్యాడని నువ్వడ గొచ్చు. కానీ నీ సందేహాన్ని తీర్చేరోజు, తప్పక చెబుతానమ్మా! ఇంతకూ బ్రౌనును గురించి నీ అభిప్రాయమేమిటి?"


"నువ్వే చెప్పావుకద మావయ్యా! ఎంతో సంస్కారంవున్న మనిషని - నా అభిప్రాయం కూడా అంతే."

"నా ఉద్దేశ్యం అది కాదమ్మా? బ్రౌను నీకు నచ్చాడాని అడుగుతున్నాను "

ఈ మాటతో ఉష కపోలాలు సిగ్గుతో కెందమ్మి మొగ్గల్లాగా విరియటం చతు ర్వేది గమనించాడు చిరునవ్వుతో మళ్లీ చతుర్వేది అన్నాడు. "నీ ఆంతర్య మేమిటో అర్థమయిందమ్మా! కానీ ఈ సమాజమూ, ఈ మనుషులూ వేసే సూటి పోటి మాటలకు తట్టుకొని, మీకు న్యాయమూ మంచిదని తోచిన పద్ధతిలో ముందుకు నడిచే మనస్థైర్యం మీకుందా? ఆ స్తోమత మీకున్నపుడు ఈ సమా జమూ, మనుషులే కాదు, ప్రపంచంలోని ఏ శక్తి మిమ్మల్ని ఎదిరించలేదు. మీరు ధైర్యంగా నిలబడగలుగుతారు. అలా నిలబడగలిగినపుడు మీకు నా ఆమోదం, ఆశీస్సులూ ఎల్లప్పుడూ వుంటాయి."

కొండంత ఏనుగుల బలం యిచ్చే చతుర్వేది మాటలకు ఉషా బ్రౌనులు సాభిప్రాయంగా ఒకరి మొహాలొకరు చూచుకొన్నారు వాళ్ళిద్దరి ముఖాలలో ద్యోతకమయిన భావాలను అర్థం చేసు కొన్న చతుర్వేది సంతృప్తిగా ఒక్క నిట్టూర్పు విడిచాడు

అనుకున్నవి అనుకున్న రీతిలో జరిగితే యిహ మానవునికి పట్టపగ్గాలుం డవు ఉన్నట్లుండి చతుర్వేదికి మూడో మారు గుండెపోటు వచ్చింది. చావు బతుకుల్లో వున్నాడు కొడుకుల్నూ, కోడళ్ళు, తదితర బంధు వర్గమంతా



టెలిగ్రాములందిన మరుక్షణం బయల్దేరి వచ్చారు. చతుర్వేది ఆరోగ్యస్థితి మరీ ప్రమాదకరంగా వుంది. ఆయన్ను ప్రమాదంనుంచి తప్పించటానికి డాక్టర్లు తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు కాని చతుర్వేది పరిస్థితి క్షణక్షణానికి దిగజారిపోతూంది. బ్రౌన్ చతుర్వేది ప్రక్కనే వుంటూ రాత్రింబగళ్లు సేవ చేస్తున్నాడు. ఇది ఇతర బంధువులకు కన్నెర్రయింది నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడసాగారు. ఎక్కణ్ణుంచో వూడిపడ్డ ఒక విదేశీయుడికి చతుర్వేదిపట్ల అంత అభిమానం ఎందుకుః అదంతా నటన - చతుర్వేది ఆస్తికి ఎసరు పెట్టి, సేవ చేస్తూన్నట్టు నటిస్తున్నాడని ఎత్తిపొడిచారు. ఎవరెన్ని అన్నా బ్రౌన్ మాత్రం మంచం వదిలి రావడం లేదు ఉష బ్రౌన్‌కు చేదోడు వాదోడుగా వుంటూ మావయ్యకు సపర్యలు చేయసాగింది

బంధువర్గం చతుర్వేది ఆస్తిపాస్తులను గురించి ఆరా తీయసాగారు. లాయర్లను సంప్రదించారు. చివరకు తేలిందేమిటంటే చతుర్వేది ఆస్తంతా అతడి స్వార్జితమేనని, అందువల్ల తన యావదాస్తిని తనకిష్టమొచ్చినవాళ్ళకు చెందేటట్లు విల్లు రాసే హక్కు వుందని. దాంతో అంతా నిరాశ చెందారు

ఇంకో గంటలో ప్రాణం పోతుందనగా చతుర్వేది లాయరుకోసం కబురంపాడు. లాయరు రాగానే "చూడండి లాయరుగారూ ! కాసేపు మీతో ఏకాం

తంగా మాట్లాడాలి" అన్నాడు చతుర్వేది హీనస్వరంతో

లాయరు వెంటనే అందర్నీ బయటకు పంపేశాడు గదిలో లాయరు, చతుర్వేది మిగిలారు. "చూడండి లాయరుగారూ! నా కిలా అవసానదశ ఏ క్షణాన్నయినా ముంచుకొస్తుందని తెలుసు. అందుకే ముందుగా విల్లు తయారుచేసి వుంచాను ఈ గుండెపోటు రావటం నాకిది మూడో పర్యాయం పదేళ్ళ క్రితం రెండుసార్లు వచ్చింది. కానీ ప్రాణాపాయం జరగ లేదు. ఈమారు నేను చనిపోవటం ఖాయం రానున్న పరిస్థితిని ముందుగానే వూహించి విల్లు తయారుచేశాను. చూస్తున్నారుగా నా కన్నబిడ్డలు నా చావుకోసం గోతికింద నక్కల్లా ఎలాకాచుకొని వున్నారో! వాళ్ళకు కావాల్సింది నావెనకాలవున్న ఆస్థి ఈ ఆస్తంతా నా స్వార్జితం. కావాలనుకుంటే ఈ ఆస్తినంతా నా యిష్టంవచ్చినట్లు వినియోగించవచ్చు-ధర్మకార్యాలకు యిచ్చెయ్యవచ్చు -కానీఅలా చేయదలచుకోలేదు. నా తదనంతరం ఈ ఆస్తంతా నా ముగ్గురి కొడుకులకు సమంగా చెందాలనీ, కూతురికి బ్యాంకులో నాపేరిటవున్న ఏభయి వేల రొక్కం చెందాలని వీలునామా రాశాను ఈ వీలునామాను రిజిష్టరు చేయించి అమలు జరిగేటట్లు చూడాల్సిన బాధ్యత మీ మీద వుంచుతున్నాను. మీకు ఆశ్చర్యంగా వుందికదూ! ఉన్నది ఇద్దరు కొడుకులయితే, మూడోవాడెక్కణ్ణుంచి వూడిపడ్డాడని. అలాంటి సందేహం కలగటంలో ఆశ్చర్యంలేదు నా విల్లుతోబాటు మీకు రెండు జాబులందజేస్తున్నాను అందులో ఒకటి మీ అందరినీ వుద్దేశిస్తూ రాసినది - రెండో వుత్తరం 'ఎలిజబెత్' అనే అమెరికన్ యువతి ఆమె తుది ఘడియల్లో నాకు రాసినది ఈ రెండుజాబులు చదవండి, మీకర్థమవుతుంది నేను చనిపోయిన తర్వాత,నా శవానికిదహనసంస్కారాలు నే సూచించిన ప్రకారం జరగాలని నా చివరికోరిక, మీరు దగ్గరుండి మీ సమక్షంలో నా తుదికోరిక నెరవేరేటట్లు చూడాలి. అపుడే నా ఆత్మకు శాంతి లభిస్తుంది" అంటూ కన్నుమూశాడు. ఇల్లంతా గొల్లుమంది.

లాయరు చతుర్వేది రాసిన వుత్తరం అందరికీ వినిపించేలా చదవడం మొదలెట్టాడు.

"మారుతూన్న కాలాన్నిబట్టి, మనమూ మన సమాజమూ మారాలి. అలా మారలేనిరోజు మనమూ మన సమాజమూ, సింధూలోయ నాగరికతకు మరో నమూనాగా మాత్రమే నిలుస్తాము. మనదేశానికి స్వతంత్రం వచ్చింది - ఎన్నోరంగాలలో అభివృద్ధిని సాధించింది. ప్రగతి పథంలో యింకా యింకా ముందుకు సాగిపోవాలని పథకాలు వేస్తున్నది - కాని మనలో అనాదిగా

జీర్ణించుకొనిపోయిన మూఢాచారాలు, ఛాంధసాలు మనల్ని విడిచిపెట్టలేదు. అందుకే నిన్న మొన్న కళ్ళుతెరిచిన దేశాలుకూడా ఎంతో ప్రగతిని సాధిస్తూన్నా, మనంమాత్రం వందేళ్ళు వెనక్కి పోతున్నాం. నెహ్రూపండితుడు ఒకసారి ఉద్ఘాటించినట్లు "జాతిమత విచక్షణా రహితమయిన వసుధైక కుటుంబాన్ని నిర్మించటం మన ఆశయం కావాలని." అలా జరిగినరోజు ప్రపంచంలో శాంతి సౌమనస్యాలు వెల్లివిరుస్తాయి నా ఆకాంక్షకూడా అదే కానీ నా జీవిత కాలంలో నా ఆకాంక్షకు ఒక రూప కల్పన చేయలేకపోయాను. మీరు నా కోర్కెను మన్నించి, నాజీవితాశయాన్ని నెరవేర్చేపక్షంలో ఉషను బ్రౌనుకిచ్చి పెళ్ళిచేయాలి. ఇలా నేను కోరడానికి బలవత్తరమయిన కారణముంది. ఆ కారణమేమిటో ఎలిజబెత్‌రాసిన జాబు చదివితే మీకే తెలుస్తుంది.

ఇహ పోతే నా రెండోకోరికొకటుంది" నా తదనంతరం, బ్రౌను నాకు తల కొరివి పెట్టాలి ఒక అమెరికన్, శుద్ధ శ్రోత్రియ కుటుంబంలో పుట్టిన నాకు తలకొరివి పెట్టడమేమిటని మీకు వింతగా తోచవచ్చు. నేనిలా కోరడం సమంజసంగానూ, సాంప్రదాయబద్ధంగాను వుంది. బ్రౌను నాకు తలకొరివి పెట్టడానికి అన్నివిధాల అర్హుడు. మీరు నా చివరికోరికను మన్నిస్తారని ఆశిస్తున్నాను "

లాయరు ఉత్తరం చదవటం పూర్తి చేసి అందరివేపు సాభిప్రాయంగా చూశాడు. ఒకవిదేశీయుడు అన్యమతస్తుడు, హిందూశవానికి కొరివిపెట్టడం సాంప్రదాయ విరుద్ధమని, వాదించారు.

వెంటనే లాయరు రెండో ఉత్తరం తీసి చదవటం ప్రారంభించాడు – జాబు ఇంగ్లీషులో రాసుంది.

"డియర్.

ఇది ముప్పయి యేళ్ళనాటిమాట – నీకు గుర్తుందో లేదో! మండువేసవి కాలంలో ఒక అమెరికన్ కుటుంబం ఊటీలో ఒక కాటేజ్‌లో విడిదిచేసింది అప్పట్లో ఎండలు మండిపోతున్నాయి. నిప్పులు చెఱుగుతూ సెగగాడ్పులు వీస్తున్నాయి. ఆ ఎండలకు తట్టుకోలేక, చల్లని కొండ ప్రాంతంలో కాలం గడపాలని ఆ అమెరికన్ కుటుంబం ఊటి చేరుకుంది. వాళ్ళల్లో నేనూ వున్నాను. మా డాడీ న్యూయార్కులోని ఒక పెద్దకంపెనీకి మేనేజింగు డైరెక్టరు. కంపెనీ ఖర్చులమీద కాంటినెంటల్ టూరుకు బయల్దేరి, లండన్, ప్యారిస్, స్విస్, టర్కీ దేశాలు తిరుక్కొని చివరకు యిండియా చేరుకున్నాం — ఇండియాలోని ముఖ్యపట్టణాలన్నిటినీ చూశాం. తాజ్, ఎల్లోరా, అజంతాలలోని శిల్పకళా విన్యాసాలను చూచి ముగ్ధుల మయ్యాం – కథాకళి కూచిపూడి నాట్య భంగిమలు మా హృదయాలలో చెరిగి

పోని ముద్ర వేశాయి అప్పటికింకా భారతదేశానికి స్వాతంత్ర్యం రాలేదు. ఇంగ్లీషువారి పాలనలో వుండేది భారత దేశమన్నా భారత ప్రజలన్నా, మా డాడీకిగాని కుటుంబంలో మరే యితర సభ్యులకుగానీ సదభిప్రాయం లేదు. భారతదేశం ఒక బానిస దేశమనీ, మూఢాచారాలకు, ఛాందసాలకు, అది నిలయమని వాళ్ళ అభిప్రాయం భారత ప్రజలు మరొకరి పరిపాలనలో బానిస జాతిగా బ్రతకాల్సినవాళ్ళే కానీ, స్వతంత్ర దేశంగా బతికే అర్హత లేదనే వాడు మా డాడీ నేను మాత్రం వాళ్ళ అభిప్రాయాలతో ఏకీభవించే దాన్నికాను. భారతదేశం ఆధ్యాత్మికంగా ఎంతో పురోగతిని సాధించిన దేశమనీ, నాగరికత అంటే ఏమిటో తెలీకుండా ప్రపంచ దేశాలు పశుప్రవృత్తితో వ్యవహరిస్తున్న అంధయుగం నాటికే భారతదేశం ఆదార్శ పీఠం వహించిందనీ వాదించే దాన్ని. కాని నా వాదన నెగ్గేదికాదు.

ఊటీ అన్నా, ఆ పరిసర ప్రాంతాలన్నా నాకెంతో నచ్చాయి. ఎత్తయిన కొండలూ, పట్టు తివాచీలు పరిచినట్లుగా వున్న పచ్చని పచ్చికబయళ్లూ, అంతు తెలీని అగాధమయిన లోయలు నన్నెంతో ఆకర్షించాయి నిటారుగా వున్న ఆ కొండల్ని చూసినపుడు లండన్ రాజ ప్రాసాదం దగ్గరుండే సెంట్రీలు గుర్తుకొచ్చేవారు. ఆ పచ్చని పచ్చికబయళ్ళను చూసినపుడు, భూమాత ముదురాకు పచ్చ వెల్వెట్ శాలువా కప్పుకున్నదేమో ననిపించేది ఆ పచ్చికమీద పడి, స్వేచ్ఛగా అటూ యిటూ దొర్లాలనిపించేది. కాని నా చదువూ, సంస్కారమూ, అడ్డొచ్చేవి అక్కడ ప్రకృతి రామణీయకతను కన్నులతరువుదీరా చూస్తూ కాలం గడిపేదాన్ని. ఆ సుందర ప్రకృతి దృశ్యాల నెన్నింటిని ఫోటో తీశానో గుర్తులేదు.

ఒకరోజు మార్నింగు వాక్‌కని బయల్దేరిన నేను, కెమెరా తీసుకొని ఎంత దూరం వచ్చానో నాకే తెలీదు. ఎత్తయిన కొండశిఖరం ఎక్కి, ఉదయిస్తూన్న సూర్యుణ్ణి తాదాత్మ్యంతో చూస్తూ కూర్చున్నాను. పచ్చి బాలెంతరాలి పురిటి పొత్తిళ్ళల్లో పడుకోబెట్టిన పచ్చి నెత్తుటి ముద్దలాగున్నాడు సూర్యుడు అలా ఆ సూర్యుణ్ణి, కెంజీర లలరించుకొన్న ఆ తూర్పు కొండల్ని చూస్తూ ఎంతసేపు కాలం గడిపానో నాకే తెలీదు. ఒక్కసారి తలెత్తి చూసేసరికి, ఆకాశం మేఘావృతమై వుంది. వర్షం వచ్చే సూచనలు కనిపించాయి. నిప్పులు చెరిగే ఎండను కాస్తూన్న వేసవి కాలంలో, ఈ హఠాత్ వర్షాగమనమేమిటి ? మేము విడిది చేసున్న కాటేజ్‌కి వెళ్ళాలంటే కనీసం రెండు మైళ్ళు నడవాలి. కానీ అంతవరకూ వర్షం ఆగేట్టు లేదు. ఏ క్షణాన్నయినా కుండపోతగా వర్షం

కురిసేట్లుంది ఏం చెయ్యాలో తోచలేదు గబగబ కొండ దిగేశాను. కొండ దిగువ అయిదారు కాటేజ్‌లున్నాయి. వర్షం తగ్గేవరకూ ఆ కాటేజీలలో ఎక్కడయినా తల దాచుకోవచ్చనిపించింది.

అందుబాటులో వున్న ఒక కాటేజ్ సమీపించాను అప్పటికే సన్నటి తుంపరులుగా వర్షం ప్రారంభమయింది — కాటేజ్ సమీపించే లోపల పెద్ద పెద్ద చినుకులు పడ్తున్నాయి కాటేజ్ వరండా లోకి అడుగు పెట్టాను - పూర్తిగా తడిసి ముద్దయ్యాను కాటేజ్ తలుపు ఓరవాకిలిగా వేసుంది - మనస్సులో బెరుగ్గా వున్నా ధైర్యంచేసి లోపలకు అడుగు పెట్టాను ఎవరో యువకుడు ఈజీ ఛెయిర్‌లో పడుకొని ఇంగ్లీషు నవలేదో చదువుకుంటున్నాడు. నా రాకను గమనించలేదు "మే ఐ కమిన్" అన్నాను

నావేపు చూడకుండానే "యస్. కమిన్" అన్నాడా యువకుడు నేను నాలుగడుగులు ముందుకు వేశాను అప్పటికీ ఆ యువకుడు తనదృష్టి పుస్తకంమీదనుంచి మరల్చలేదు అతడి దృష్టి ఆకర్షించడానికి, ఒక చిన్న పొడి దగ్గు దగ్గాను ఈమారు అతడు నావేపు చూశాడు, హఠాత్తుగా ఒక అపరిచిత స్త్రీ తన కాటేజ్‌లోకి ప్రవేశించేసరికి, ఆ యువకుడు మొదట్లో కాస్త కంగారు పడ్డాడు. తర్వాతతనకంగారును సర్దుకొని "అరెరే! పూర్తిగా తడిసి ముద్దయ్యారే ఈ టవలుతో ముందు తలతుడుచుకోండి" అని టవలందిచ్చాడు. నేను తలతుడుచుకొంటూ కుర్చీలోకూర్చుని నన్ను నేను పరిచయం చేసుకొన్నాను బాయ్‌ని కేకేసి వేడివేడి టీ తీసుకొనిరమ్మన్నాడు

డియర్! ఇప్పుడు నీకు ఈ సన్నివేశం బాగా గుర్తొచ్చిందనుకొంటాను ఆ యువకుడు మరెవరోకాదు నువ్వే! అప్పట్లో నీవు జిల్లాకలెక్టరుగా పనిజేస్తున్నావు సెలవుమీద ఊటీలో వేసవి గడుపుదామని వచ్చావ్—

ఇలా కాకతాళీయంగా ప్రారంభమయిన మనపరిచయం గాఢస్నేహంగా మారింది ఆ స్నేహం చివరకు ప్రణయంగా పరిణమించింది. రోజూ మీ కాటేజ్‌కు వచ్చి గంటలతరబడి కాలం గడిపేదాన్ని నీ సాన్నిధ్యంలో వున్నపుడు గంటలు నిమిషాల్లాగా గడిచిపోయేవి నిన్నొకక్షణం చూడకుంటే కొన్ని యుగాలు గడిచినట్లుండేది - అలాగే నీగుండెలమీద తల ఆన్చివుండిపోవాలనీ, నీ గాఢ పరిష్వంగంలో జీవితాంతం గడిపేయాలని వుండేది - నీ సమక్షంలో ఆ కొండల్నీ, లోయలను చూస్తూవుంటే పొద్దుతెలిసేదికాదు. నీ దగ్గర గడిపిన ఘడియలు మధురక్షణాలుగా నిలిచిపోయాయి

ఆ చల్లటి కొండప్రాంతంలోని కౌషస రాగదీప్తులు, సంధ్యామరీచికలూ

చిత్రకారుని వర్ణచిత్రంలాగా నాహృదయ ఫలకంమీద ఈనాటికీ గాఢంగా హత్తుకొనిపోయాయి.

ఒకరోజు మా డాడీవచ్చి మా ప్రయాణం మరుసటిరోజు మార్నింగ్ ఫ్లైట్‌కు నిశ్చయమయిందనీ, ప్రయాణానికి తయారుకమ్మనిచెప్పాడు. ఆ మాటతో నా గుండెల్లో రాయిపడింది అప్పటికప్పుడే నీవు వుంటూన్న కాటేజ్ దగ్గరకు పరుగెత్తాను నీతో మన పెళ్ళి విషయం మాట్లాడదామనుకొన్నాను. నాకు తెలుసు. మనపెళ్ళి జరగటం అసంభవమని. సాంప్రదాయమయిన హిందూ కుటుంబంలోపుట్టిన నీకూ అమెరికాలో పుట్టిన నాకూ పెళ్ళయ్యే అవకాశాలు తక్కువనికూడా నాకు తెలుసు. అయినా, నా ఆశచావలేదు. విదేశాల్లో చదువుకొని అక్కడివాతావరణానికి అలవాటుపడిన నీవు, సంఘాన్ని ఎదిరించయినా నన్ను స్వీకరించగలవన్న ఆశాభావమే నన్ను నీదగ్గరకు పంపింది - కానీ దురదృష్టం నన్ను వెంటాడుతూనేవుంది -నీ కాటేజ్ తాళంవేసుంది - విచారించగా నీవు అత్యవసరమయిన ఆఫీసు పనిమీద మద్రాసుకు వెళ్ళావనీ రెండ్రోజులలో తిరిగి రాగలవనీ వాచ్‌మ్యాన్ చెప్పాడు. చేసేదేమీలేక, జాబురాసి నీవు తిరిగి రాగానే నీకివ్వమని వాచ్‌మ్యాన్‌తో చెప్పి వచ్చేశాను.

ఆ రాత్రంతా నాకు నిదురపట్టలేదు. కళ్ళు మూసినా, తెరిసినా నీరూపే నా కళ్ళముందు మెదిలేది; ఆ రాత్రంతా ఏడుస్తూ పడుకొన్నాను. తెల్లవారుతూండగానే, సూర్యుణ్ణి తిట్టుకొన్నాను కాని ఏంచేయను - మావాళ్ళతో అమెరికాకు వెళ్ళక తప్పలేదు.

అమెరికా చేరిన రెణ్ణెళ్ళతర్వాత నాలో ఏదో శారీరకంగా మార్పులు కనిపించాయి నేనెరిగున్న ఒక లేడీ డాక్టరును సంప్రదించాను నేను గర్భవతిగానున్నానని చెప్పింది. దాంతో కుప్పకూలిపోయాను ఏంచేయాలో తోచలేదు. చావడానికెన్ని మార్గాలున్నాయో, అన్నీ ఒక్కసారి నాకళ్ళముందు మెదిలాయి. కానీ ఆత్మహత్య చేసుకొనే మనోధైర్యము లేకపోయింది అయినా నాలో ఆశపోలేదు. జరిగిందంతా విపులంగా నీకు ఉత్తరంరాశాను. నన్ను వెంటనే ఇండియాకు వచ్చెయ్యమంటావని ఆశగా నీ జవాబుకోసం ఎదురుచూశాను. కాని ప్రయోజనం శూన్యం. ప్రతిరోజు నీ జవాబుకోసం చూచి, చూచి నా కళ్ళు కాయలుకాచిపోయాయి. కానీ చివరకు నిరాశేమిగిలింది

రోజులు గడిచేకొద్దీ శారీరకంగా నాలో కలిగేమార్పులు ప్రస్ఫుటంగా కనిపించసాగాయి. ఇంక ఎంతోకాలం ఈ రహస్యాన్ని దాచలేననిపించింది. అసలు రహస్యం బయటపడ్డరోజు మా డాడీ మమ్మీ మండిపడ్డారు. ఎన్నో మాట



లన్నారు మిమ్మల్ని. మీ వేళాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. అన్నిటినీ ఓర్పుతో సహించాను ఆఖరుగా వాళ్ళకొకేమాట చెప్పాను నాకు పెళ్ళంటూ జరిగితే, మీతో జరగాలని. లేకుంటే జీవితాంతం అవివాహితగానే వుండిపోతానని చెప్పాను. దాంతోటి వాళ్ళు మరీ వుగ్రులయ్యారు - అయినా చేసేదిలేక, నన్నొక మారుమూల పల్లెకు తీసుకెళ్ళి అక్కడ మకాంపెట్టారు అక్కడ నేను మగశిశువును ప్రసవించాను.

ఈలోపల నేను మీకెన్ని జాబులు రాశానో లెక్కలేదు కనీసం ఒక్క దానికయినా సమాధానం రాలేదు జీవితంలో ఒక్కసారయినా మిమ్మల్ని కలుసుకోవాలనీ, మన ప్రేమ ఫలితంగా కలిగిన బిడ్డను మీకు చూపించాలనీ నేనెంతగానో వుబలాటపడ్డాను. కానీ నా

ఆశలన్నీ నిరాశలయ్యాయి. మోడు వారిన నాజీవితం చిగురించే అవకాశం లేశమాత్రంగానయినా కనిపించలేదు ఇండియాలోని మీ వునికితెలుసుకోవాలని చేసినప్రయత్నాలన్నీ నిరుపయోగ మయ్యాయి. ఐతికినంతకాలం నేను అవివాహితగానే వుండిపోయాను.

పిల్లవాడు ఎదిగి పెద్దవాడయ్యాడు. నేనో కాన్వెంటు స్కూల్లో పనిచేస్తూ, నా సంపాదనతో పిల్లవాణ్ణి చదివించి పెద్దచేశాను. నా పెంపకంలో వాడికి భారతదేశమంటే గౌరవమూ, భక్తి ప్రపత్తులు కలిగేటట్లు పెంచాను.

నాకు జీవితం చివరి అధ్యాయం లోకి వచ్చిందని తెలుసుకొన్న రోజు, బ్రౌన్ను నా దగ్గరకు పిలిచాను. నేను పటిలంగా భద్రపరచిన బ్రీఫ్‌కేసు యిండియాలో వుంటూన్న మీకంద చేయాలని, అది నా తుదికోరికని చెప్పాను. ఎదురుచెప్పకుండా అంగీ కరించాడు - మిమ్మల్ని కలుసుకునే వరకూ ఏ పరిస్థితులంలోకూడా బ్రీఫ్ కేసు తెరవకూడదని చెప్పాను. మీ అడ్రసు నాకెలా తెలిసిందని ఆశ్చర్యంగా వుందికదూ! అదో విచిత్రసంఘటన మా యింట్లో మీ ప్రాంతపువాడు పై చదువులకోసం వచ్చి పేయింగుగెస్ట్‌గా వుంటున్నాడు. అతనికి హిందూ పత్రిక వచ్చేది. ఒకసారి ఆ పత్రికలో మీరు బోర్డు మెంబరుగా రిటైరు అయినట్లు హైదరాబాదులోని బంజారాహిల్స్‌లో యిల్లు కట్టుకొని స్థిరపడినట్లు ఒక వార్త ప్రచురించారు ఆ పేపరు కటింగును భద్రపరిచాను, ఆ పేపరు కటింగు సాయంతో బ్రౌన్ను మీ దగ్గరకు పంప గలిగాను..

మరుజన్మకయినా భారతనారిగా జన్మించి, మీ భార్యనయ్యే అర్హత పొందాలని తాపత్రయపడే,

మీ లవింగ్లీ స్వీట్ హార్ట్
ఎలిజబెత్

ఉత్తరం చదువుతూన్నంతసేపూ ప్రతిఒక్కరూ ఎంతో కుతూహలంతో విన్నారు బ్రౌను చతుర్వేదులమధ్య యింతటి విషాదగాథ నిక్షిప్తమైవుందని తెలిసికొన్నపుడు కొందరు సానుభూతితో చతుర్వేదిని సమర్థించారు కొందరు నిరసించారు. కాకతాళీయంగా కలుసు కొన్నప్పటికీ చతుర్వేదినే భర్తగా స్వీక రించి ఆజన్మాంతం అవివాహితగానే వుండిపోయిన ఎలిజబెత్‌ను కొందరు ప్రశంసించారు శాస్త్రోక్తంగా అమెరికన్ స్త్రీని పెళ్ళాడకపోయినప్పటికీ, ముప్ప య్యేళ్ళతర్వాతకూడా ఆమెనే తన భార్యగా పదిమందిలో గుర్తించి, ఆమె వల్ల కలిగిన బిడ్డను తన కొడుకుగా పదిమందిలో బాహాటంగా చెప్పిన చతు ర్వేది నైతిక సాహసాన్ని శ్లాఘించారు

కర్మకాండకు ఎవరు కర్తృత్వం వహించాలన్న విషయంపై వాదోప

వాదాలు జరిగాయి. చివరకు బ్రౌన్ తలకొరివి పెట్టాలని పెద్దలు నిర్ణయించారు

తనకు జన్మనిచ్చినవాడు, పవిత్ర భారతదేశ పౌరుడని తెలుసుకొన్న బ్రౌను కొన్నిక్షణాలు మౌనంగానిల్చొని చతుర్వేదిశవంవేపు నిర్లిప్తంగా శూన్యదృక్కులతో చూస్తూ నిల్చున్నాడు. ఆకాశగంగ రెండుపాయలుగా చీలి, కనుదమ్ములమండి వాగులై సెలయేరులై ప్రవహించింది

"మిస్టర్ బ్రౌన్ బాధపడుతున్నావా" అంది ఉష ఓదార్పుగా.

అక్కడ చేరిన జనంలో తనను ఆదరించి ఆప్యాయంగా పలకరించే వాళ్ళిద్దరే ఒకరు ఉష మరొకరు నాయర్.

"పుట్టిననాటినుంచీ కన్నతండ్రి ఎవరో తెలీకుండా మా మమ్మీ పెంపకంలో పెరిగాను రెండేళ్ళక్రితం నన్ని ప్రపంచంలో ఒంటరివాణ్ణిచేసి మా మమ్మీ నాకు దూరమయింది - నాకు జన్మనిచ్చినతండ్రి ఫలానావ్యక్తనితెలుసుకొనేలోపల, ఆయన అమృతహృదయం కూడా నాకు కరువయ్యింది ఇక ఈ ఒంటరి జీవితంలో నా మనసుకు కాస్త పూరట కలిగించగలిగిన వ్యక్తివి నీవొక్కతెవే ఉషా! నీ సాహచర్యంలో నా బాధను మరిచిపోగలనన్న నమ్మకం నాకుంది" అని ఉషచేతిని ఆప్యాయంగా తనచేతుల్లోకి తీసుకొని నిమిరాడు.

చతుర్వేది అంతిమయాత్ర బయల్దేరింది నిప్పుపట్టుకొని. ముందు బ్రౌన్ నడుస్తూండగా, పత్రికా విలేకర్లు, ఫోటోగ్రాఫర్లు, తండోప తండాలుగా జనం పాల్గొన్నారు ఆ నగరంలో అదొక అపూర్వదృశ్యం!

మంచిగంధపు చెక్కలతో చితిపేర్చబడింది బ్రౌన్ నిప్పంటించి తలకొరివి పెట్టాడు. చిటపటలాడుతూ మంటలు జాజ్వల్యమానంగా, లేదాయి ఎగిసిన మంటలు ఎర్రటి నాలుకలుచాస్తూ సంజకెంజాయలో కలిసిపోయాయి. ప్రక్కనున్న జువ్విచెట్టుమీదనుంచి రెండు పాలపిట్టలు రివ్వున అనంతాకాశంలోకి ఎగిరిపోయాయి

(సమాప్తం)

